సాక్షి
మంచిర్యాల

గురువారం । 9 । నవంబర్ । 2023



భక్తజనసంద్రంగా కాకో ఆలయం

దండేపల్లి మండలం గుడిరేవు గోదావరి ఒడ్డున ఉన్న పద్మల్‌పురి కాకోక అమ్మవారి ఆలయం భక్తజనసంద్రంగా మారింది. ఉమ్మడి జిల్లా నుంచి గిరిజనులు తరలివచ్చారు. IIలో▸



ఆస్పత్రి.. అసంపూర్తి

మంచిర్యాలలో ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ప్రస్తుతం నిర్వహిస్తున్న భవనంలో వసతులు కరువై రోగులు ఇబ్బందులు పడుతున్నారు. IIIలో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 31.0 /22.0

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉత్తరం దిశగా చలిగాలులు వీస్తాయి. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగే అవకాశం ఉంది.

ఆలోచించి ఓటేయాలి

- అభ్యర్థి గుణగణాలు చూడాలె..
- పార్టీ చరిత్ర ఏందో తెలుసుకోవాలి
- బీఆర్‌ఎస్ ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్
- సీఎంను వరాలు కోరిన ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య
- ప్రత్యర్థికి నోట్ల కట్టలు ఉంటే తనకు ప్రజాబలం ఉందన్న చిన్నయ్య
- అధికారంలోకి రాగానే సమస్యలు తీరుస్తానని సీఎం అభయం



విజయ సంకేతం చూపిస్తున్న సీఎం కేసీఆర్



సభకు హాజరైన ప్రజలు



బోనం, బతుకమ్మలతో సభకు వస్తున్న మహిళలు

బెల్లంపల్లి: 'ఎన్నికలు వస్తయ్.. పోతయ్.. ఇప్పటికే ఎన్నోసార్లు ఓట్లేశారు. ఈ నెల 30 తారీఖున ఓట్లు, వచ్చే నెల 3న ఓట్లు లెక్కబెడ్తరు.. అయితే ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల గుణగణాలు, మంచి చెడ్డలు చూడాలే. అభ్యర్థి వెనుక ఉన్న పార్టీని చూడాలే. ఆ పార్టీ చరిత్ర ఏందో తెలుసుకోవాలే. ప్రజల గురించి ఎట్ల ఆలోచిస్తరో తెలుసుకోవాలి.. ఆలోచించి ఓటేయాలి..' అని బీఆర్‌ఎస్ పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ అన్నారు. బీఆర్‌ఎస్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం బెల్లంపల్లి సింగరేణి తిలక్ స్టేడియంలో పార్టీ బెల్లంపల్లి అభ్యర్థి దుర్గం చిన్నయ్య అధ్యక్షతన నిర్వహించిన ప్రజా ఆశీర్వాద బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. 'చిన్నయ్య నువ్వేం భయపడకు. పార్టీ మారేటోళ్లు గొర్రెల్లెక్క మారుతరు. ఎవడో ఒకడు అమ్ముడపోతే గాబరాపడొద్దు. అసోంటోళ్లను చూసి భయపడాల్సిన అవసరం లేదు. నీకు ప్రజాబలం, ఆశీర్వాదం ఉంది. వాళ్లే నీకు శ్రీరామరక్ష. చెన్నూర్‌లో చెల్లని రూపాయి బెల్లంపల్లిలో చెల్తదా..? డబ్బుల కట్టలు తెచ్చుకుని దిగే వ్యక్తి చెన్నూర్‌లో ఐదుసార్లు పోటీ చేస్తే నాలుగుసార్లు ఓడించిండ్లు. అక్కడ తిరస్కరించిన వ్యక్తిని ఇక్కడెట్ల గెలిపిస్తరు..? రైతుబీమా, రైతుబంధు, రోజుకు 24గంటలు కరెంటు ఉండాలంటే చిన్నయ్య గెలవాలె.' అని కేసీఆర్ అన్నారు. బెల్లంపల్లి చాలా చైతన్యవంతమైన ప్రాంతమని, ఇక్కడ న్నో ఉద్యమాలు జరిగాయని, ఈ ప్రాంత ప్రాధాన్యతను గుర్తు చేసి స్థానికుల్లో జోష్‌నింపారు.

సింగరేణి అభివృద్ధిపై ప్రస్తావన

తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు సింగరేణి ఎట్లుండెనో, స్వరాష్ట్రం ఏర్పడ్డాక ఏ తీరుగా అభివృద్ధి జరిగిందో సీఎం కేసీఆర్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. 134ఏళ్ల క్రితం సింగరేణి ఏర్పడింది. ఇల్లెందు తర్వాత బెల్లంపల్లిలోనే రెండో గనణి ఏర్పడింది. సింగరేణిని ముంచిందే కాంగ్రెస్ అని, ఆ దద్దమ్మలు కేంద్రం వద్ద అప్పులు తెచ్చి 49శాతం వాటా ఇచ్చింద్రని కేసీఆర్ కాంగ్రెస్ నాయకులపై ధ్వజమెత్తారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం వచ్చాక సింగరేణికి రూ.2,200 కోట్ల ఆదాయం వచ్చిందని, దసరా, దీపావళి బోనస్ కలిపి కార్మికులకు రూ.1000 కోట్లు చెల్లిస్తున్నామని తెలిపారు.

బీఆర్‌ఎస్‌లో చేరిన కామ్రేడ్లు

సీఎం కేసీఆర్ సమక్షంలో ఎంసీపీఐ(యూ), సీపీఐ నాయకులు ఇరువురు గులాబీ తీర్థం పుచ్చుకున్నారు. ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి సబ్బని కృష్ణ, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మామిడాల రాజేశం, వైఎస్సార్‌టీపీ నాయకుడు కాశీ సతీష్‌కుమార్ తదితరులు పార్టీలో చేరారు. వీరికి ముఖ్యమంత్రి కేసీఆర్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

సభకు హాజరైన నాయకులు

ఈ సభలో పెద్దపల్లి ఎంపీ వెంకటేష్ నేత, ఎమ్మెల్సీ దండే విఠల్, రాష్ట్ర ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్, మంచిర్యాల ఎమ్మెల్యే ఎన్.దివాకర్ రావు, మాజీ ఎమ్మెల్యేలు బోడ జనార్దన్, గడ్డం అరవిందరెడ్డి, రాష్ట్ర ఫిల్మ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పి.రాంమ్మోహన్‌రావు, టీబీజీకేఎస్ అగ్రనాయకులు బి.వెంకట్రావు, కెంగర్ల మల్లయ్య, మిర్యాల రాజిరెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ సత్యనారాయణ, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

చిన్నయ్య కోరికలు తీరుస్తా..

బెల్లంపల్లి బీఆర్‌ఎస్ అభ్యర్థి దుర్గం చిన్నయ్య బెల్లంపల్లి అభివృద్ధి కోసం పలు సమస్యలను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని అభ్యర్థించారు. ప్రత్యర్థికి నోట్ల కట్టలు ఉంటే తనకు ప్రజాబలం ఉందన్న అన్నారు. బెల్లంపల్లిలో ఇంకా ఏడు వేల మందికి ఇళ్లపట్టాలు ఇవ్వాలని, ఇంజినీరింగ్ కళాశాల, గిరిజన గురుకుల డిగ్రీ కళాశాల మంజూరు చేయాలని, పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, బెల్లంపల్లి ప్రజలకు గోదారి జలాలు సరఫరా చేయాలని, కాసిపేట,



మాట్లాడుతున్న కేసీఆర్, పక్కన చిన్నయ్య

నెన్నెల మండలాల్లో సాగునీటి ప్రాజెక్టులు నిర్మించాలని కోరగా.. సీఎం కేసీఆర్ సానుకూలంగా స్పందించి ఎన్నికల్లో గెలిచిన తర్వాత తప్పక మంజూరు చేసి బెల్లంపల్లిని అభివృద్ధి చేస్తానని సభాముఖంగా హామీనిచ్చారు.

ఉరకలెత్తిన 'గులాబీ' ఉత్సాహం

వేలాది మంది ప్రజలు తరలి రావడంతో సభా ప్రాంగణం జనసంద్రంగా మారింది. సీఎం కేసీఆర్ ప్రసంగం గులాబీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని ఉరకలెత్తించింది. తాండూర్, కాసిపేట, భీమిని, కన్నెపల్లి, వేమనపల్లి, నెన్నెల మండలాలతో పాటు బెల్లంపల్లి మున్సిపాల్టీ, గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రజలు బస్సులు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు, ప్రత్యేక వాహనాల్లో తరలి వచ్చారు. సభను పురస్కరించుకుని పట్టణమంతా గులాబీమయమైంది. పాత బస్టాండ్ ఏరియా, పాత జీఎం కార్యాలయం చౌరస్తా, బజారుఏరియా ప్రాంతం, తిలక్‌స్టేడియం ప్రధాన ద్వారా ముందు భారీ కటౌట్లు, ఫ్లెక్సీలు, పార్టీ జెండాలు ఏర్పాటు చేశారు. బెల్లంపల్లి, గ్రామీణ ప్రాంత మహిళలు నెత్తిన బోనం, బతుకమ్మలను ఎత్తుకుని వచ్చి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. శాంతిఖని గని కార్మికులు నెత్తిన డ్యూటీ టోపీలు ధరించి హాజరయ్యారు. డప్పు చప్పుళ్లతో నృత్యాలు చేస్తూ సభ ప్రాంగణానికి వరుస క్రమంలో చేరుకున్నారు. తిలక్ స్టేడియం ప్రధాన ద్వారం వద్ద నుంచి సభావేదిక వద్దకు చేరే మార్గం పూర్తిగా జనంతో కిక్కిరిసిపోయింది. తెలంగాణ జానపద గాయకుడు మిట్టపల్లి సురేందర్ ఇతర కళాకారులు సభలో పాడిన పాటలు జనాన్ని ఎంతగానో ఉత్సాహపరిచాయి. సీఎం కేసీఆర్ సభకు చేరుకోగానే సభికులు రెట్టించిన ఉత్సాహంతో చేతిలో ఉన్న పార్టీ కండువాలు, దస్తీలు, జెండాలు, చేతులు పైకెత్తి ఊపుతూ స్వాగతం పలికారు.



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి చిన్నయ్య, వేదికపై ఎమ్మెల్యే దివాకర్‌రావు, విప్ సుమన్, ఎంపీ వెంకటేష్‌నేత, ఎమ్మెల్సీ విఠల్, నాయకులు

కొనసాగుతున్న నామినేషన్ల పర్వం

మంచిర్యాలటౌన్: జిల్లాలో నామినేషన్ల పర్వం కొనసాగుతోంది. మంచిర్యాల అసెంబ్లీ నియోజకవర్గానికి బుధవారం ఆరుగురు నామినేషన్ వేశారు. అభ్యర్థుల నుంచి ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాములు నామినేషన్లు స్వీకరించారు. బీఎస్పీ అభ్యర్థి తోట శ్రీనివాస్ తరఫున ఆయన సతీమణి తోట రజిత నామినేషన్ వేయగా, బీఎస్పీ నాయకులు కొడిమెల రాజేశ్, కాదాసు రవీందర్ పాల్గొన్నారు. స్వతంత్ర అభ్యర్థులు రంగు మల్లేశ్, నహీంపాష, విద్యార్థుల రాజకీయ పార్టీ నుంచి గొర్లపల్లి సురేశ్, యుగ తులసి పార్టీ నుంచి సొల్లు సందీప్, స్వతంత్ర అభ్యర్థిగా తాళ్లురి వెంకటేశ్ నామినేషన్ వేశారు.

బెల్లంపల్లిలో..

బెల్లంపల్లి: బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గానికి బుధవారం ముగ్గురు అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి బి.రాహుల్ తెలిపారు. స్వతంత్ర అభ్యర్థి కొండగొర్ల వేదప్రకాష్, ధర్మ సమాజ్‌పార్టీ తరఫున జంగపల్లి రామస్వామి, స్వతంత్ర అభ్యర్థిగా పెరుగు రవీందర్ నామినేషన్ వేశారు. వీరిలో రామస్వామి మూడు సెట్లు, రవీందర్ రెండు సెట్ల చొప్పున పత్రాలు అందజేశారు.

చెన్నూర్‌లో..

చెన్నూర్: చెన్నూర్‌లో బుధవారం నలుగురు అభ్యర్థులు నామినేషన్ పత్రాలు అందజేసినట్లు నియోజకవర్గ ఎన్నికల అధికారి సిడాం దత్తు తెలిపారు. ప్రజారాజ్య సమితి అభ్యర్థిగా సల్లూరి మహేశ్, తెలంగాణ రాజ్యసమితి అభ్యర్థిగా వడ్లకొండ రాజం, ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ అభ్యర్థిగా సోగాల సంజీవ్, స్వతంత్ర అభ్యర్థిగా జుమ్మిడి గోపాల్ నామినేషన్ వేసినట్లు పేర్కొన్నారు. మొత్తం తొమ్మిది నామినేషన్లు దాఖలైనట్లు తెలిపారు.

నేడు ప్రధాన పార్టీ అభ్యర్థులు

చెన్నూర్‌లో గురువారం ప్రధాన పార్టీలైన బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయనున్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి బాల్క సుమన్ ఉదయం 9 గంటలకు స్థానిక జగన్నాథాలయంలో పూజలు చేసి నామినేషన్ అందజేయనున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వివేక్ స్థానిక శివాలయంలో పూజల అనంతరం నామినేషన్ వేస్తారు.



బీఎస్పీ అభ్యర్థి శ్రీనివాస్ తరఫున నామినేషన్



బెల్లంపల్లిలో నామినేషన్ వేస్తున్న రామస్వామి

శాశ్వత ఉద్యోగాలు కల్పించాలి

- ఎస్టీపీపీలో సమాన పనికి సమాన వేతనాలు కావాలి
- ప్రభావిత పల్లెల్లో మౌలిక నదుపాయాలు కరువు
- సాక్షి ప్రజా ఏజెండాలో భూనిర్వాసితులు, కార్మికులు



జైపూర్ పవర్ ప్లాంటు వద్ద స్థానిక భూనిర్వాసితులు, కార్మికులు

జైపూర్: సింగరేణి థర్మల్ పవర్‌ప్లాంటు(ఎస్టీపీపీ)లో భూ నిర్వాసితులకు శాశ్వత ఉద్యోగాలు కల్పించాలని స్థానిక భూ నిర్వాసితులు, కాంట్రాక్టు కార్మికులు అభిప్రాయం వ్యక్తం చేశారు. 'సాక్షి' నిర్వహించిన ప్రజా ఎజెండాలో పలువురు మాట్లాడారు. మండలంలోని పెగడపల్లి శివారులో 1200 మెగావాట్ల సింగరేణి థర్మల్ విద్యుత్‌కేంద్రానికి జైపూర్, పెగడపల్లి, గంగిపల్లి, ఎల్కంటి గ్రామాల రైతుల నుంచి సుమారు 2,200 ఎకరాలు భూమి సేకరించారు. రూ.8,500 కోట్లతో ప్లాంటు పూర్తి చేసి రెండు యూనిట్ల ద్వారా నిరంతరం విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు. ప్లాంటు నిర్మాణ సమయంలో భూ నిర్వాసితులు, నిరుద్యోగ యువతకు శాశ్వత ఉద్యోగాల కల్పనకు హామీనిచ్చారు. కానీ విద్యుత్ ఉత్పత్తి, నిర్వహణ చేపడుతున్న పవర్‌మేక్ కంపెనీలో భూ నిర్వాసితులు, స్థానికులకు కాంట్రాక్టు పద్ధతుల్లో ఉద్యోగాలు కల్పించారు. అర్హతకు తగిన వేతనాలు, అలవెన్స్‌లు కల్పించడం లేదని అంటున్నారు. ఎన్టీపీసీ తరహా ప్లాంటులో కార్మికులకు స్పెషల్ అలవెన్స్‌లు, డస్ట్ అలవెన్స్‌లు, మెరుగైన వేతనాలు చెల్లిస్తున్నా ఎస్టీపీపీ కార్మికుల శ్రమ దోపిడీకి పాల్పడుతున్నారని వాపోతున్నారు. ఇక ప్రభావిత గ్రామాల్లో మౌలి క వసతులను సంస్థ పూర్తిగా విస్మరిస్తోందని, సీఎస్ఆర్ కిందట ఏటా ఖర్చు చేయాల్సిన నిధులను ఇతర ప్రాంతాల్లో ఖర్చు చేస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇతర ప్రాంతాలకు నిధులు



పవర్ ప్లాంటు ప్రభావిత గ్రామాల్లో ప్రతిఏటా ఖర్చు చేయాల్సిన సీఎస్ఆర్ నిధులను ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. గ్రామాల్లో ప్రజలకు మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాల్సిన అధికారులు వాటిపైన దృష్టి సారించకపోవడంతో కోట్ల రూపాయలు వృథా అవుతున్నాయి.

– పొలమాకుల లింగారెడ్డి, గంగిపల్లి సర్పంచ్

సౌకర్యాలు కల్పించడం లేదు



పవర్ ప్లాంటులో కార్మికులకు కనీస సౌకర్యాలు కల్పించడం లేదు. క్యాంటీన్ ఉన్నప్పటికీ నాణ్యమైన వంటకాలు, స్నాక్స్ అందించడం లేదు. సబ్సిడీపై అందించాల్సి ఉన్నప్పటికీ అవేమీ పాటించడం లేదు. – ఆర్కేల రమేశ్

ప్రమోషన్లు లేవు



పవర్ ప్లాంటులో ఐదేళ్లుగా పని చేస్తున్నా స్థాని కులకు ప్రమోషన్లు కల్పించడం లేదు. విద్య, అర్హత ఉన్నప్పటికీ స్థానికులను చిన్నచూపు చూస్తున్నారు. నార్త్ సైడ్ వాళ్లకి ఎక్కువగా ప్రాధాన్యం ఇస్తూ వాళ్లకు ఎక్కువగా వేతనాలు చెల్లిస్తూ స్థానికులకు తక్కువ వేతనాలు చెల్లిస్తున్నారు. – పొలమాకుల నరేందర్‌రెడ్డి

స్థానికులకు తీవ్ర అన్యాయం



పవర్ ప్లాంటులో స్థానికులకు తీవ్ర అన్యాయం జరుగుతోంది. ఇతర ప్రాంతాల్లో వారికి మెరుగైన వేతనాలు ఇస్తూ స్థానికులకు అర్హతకు తగిన వేతనాలు ఇవ్వడం లేదు. స్థానికేతరులకు ఉద్యోగాలు కల్పిస్తూ స్థానికులకు మొండిచేయి చూపిస్తున్నారు.

– చినూరి సత్యం

సమీప పల్లెలపై కాలుష్యం



పవర్ ప్లాంటును ఆనుకుని ఉన్న పెగడపల్లి, గంగిపల్లి, ఎల్కంటి గ్రామాలపై కాలుష్యం విషం చిమ్ముతోంది. దుమ్ము, ధూళి, పెద్ద శబ్దాలతో ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారు. కాలుష్య నియంత్రణకు అధికారులు చెట్ల పెంపకం చేపట్టక ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. – రిక్కుల శ్రీనివాస్‌రెడ్డి, భూనిర్వాసిత నాయకులు

కాంట్రాక్టు కార్మికుల శ్రమదోపిడీ



తక్కువ వేతనాలతో కాంట్రాక్టు కార్మికులతో పనులు చేయిస్తూ ఎస్టీపీపీ యాజమాన్యం కాంట్రాక్టు కార్మికుల శ్రమదోపిడీకి పాల్పడుతున్నారు. పని ప్రాంతాల్లో కార్మికులకు కనీస వసతులు కల్పించడం లేదు. స్పెషల్, డస్టు అలవెన్సులు చెల్లించడం లేదు. – దుస్స భాస్కర్, బీఎంఎస్ ఎస్టీపీపీ జనరల్ సెక్రెటరీ

రెండు గంటలకు రెండు వందలా?

'అట్ల రెండు గంటలు పార్టీ మీటింగ్‌కు పోతే రెండొందలు వొచ్చే. ఇంట్ల గూసుండి ఏం చేస్తాం?' అని ఓ పార్టీ ఎన్నికల మీటింగ్‌లో మహిళను ఎందుకు వచ్చావని ప్రశ్నిస్తే ఇచ్చిన సమాధానం ఇదీ. అసెంబ్లీ ఎన్నికల వేళ ప్రత్యర్థుల ముందు తక్కువ కావొద్దనే ఉద్దేశ్యంతో అభ్యర్థులు పోటాపోటీగా వేలాదిమందితో జన సమీకరణ చేస్తున్నారు. దీంతో రెండు గంటలకే రూ.200, కొన్ని చోట్ల రూ.300 దాకా చెల్లించాల్సి వస్తోంది. చిన్నా పెద్దా, ముసలి, ముతక తేడా లేకుండా వస్తున్నారు. గతంలో ఎన్నికల సభలంటే తమ ఎమ్మెల్యే అభ్యర్థికి మద్దతుగా అభిమానంతో స్వచ్ఛందంగా తరలి వచ్చేవారు. ఇప్పుడా పరిస్థితి పూర్తిగా మారింది. సభ మొదలయ్యే గంట ముందు వెళ్లి, ముఖ్య నాయకుడి ప్రసంగం దాకా ఉండి ఇంటికి చేరుతున్నారు. మీటింగ్ టైమ్‌కు ఈ కూలీలను తీసుకొచ్చి, డబ్బులు పంచి, మళ్లీ క్షేమంగా ఇంటికి తీసుకెళ్లేలా ప్రతీ పది మందికి ఓ ఇన్చార్జీ ఉంటున్నారు. ఇక బైక్ ర్యాలీలకు కూలితోపాటు బండికి పెట్రోల్ అదనం. ఎన్నికల వేళ గ్రామ, పట్టణాలు తేడా లేకుండా ఏదైనా పార్టీ నుంచి పిలుపు వచ్చుడే ఆలస్యం.. కండువా మెడలో కప్పి, ర్యాలీలు, ప్రచార సభలకు వెళ్తూ జై కొడుతూ ఆ కార్యక్రమాన్ని సక్సెస్ చేస్తున్నారు. కొన్ని చోట్ల అయితే ఒకే రోజు రెండు పార్టీలకు కూలీగా వెళ్తున్న సందర్భాలు ఉన్నాయి. వీళ్లంతా డబ్బులిస్తే.. వస్తున్నారని తీసుకెళ్లే నాయకులకు, వెళ్లే జనానికి తెలిసినా.. ఓట్లు ఎటేస్తారో మాత్రం తెలియడం లేదు.

– సాక్షి ప్రతినిధి, మంచిర్యాల

న్యూస్‌రీల్

ఓటు హక్కును వినియోగించుకోవాలి

- డీఆర్‌డీవో శేషాద్రి



అవగాహన సదస్సులో డీఆర్‌డీవో

దండేపల్లి: ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని డీఆర్‌డీవో శేషాద్రి కోరారు. దండేపల్లి శ్రీలక్ష్మి మండల సమాఖ్య కార్యాలయంలో గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఓటర్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో పాల్గొని మాట్లాడారు. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని తెలిపారు. ప్రతీచోట వంద శాతం పోలింగ్ జరగాలని అన్నారు. అనంతరం సాంస్కృతిక సారథి కళాకారులు ఓటు హక్కుపై కళాజాత ప్రదర్శన ద్వారా నిర్వహించారు. ఏపీఎం బ్రహ్మయ్య, సీసీలు గ్రామైఖ్య లీడర్లు, కళాకారులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా హ్యాండ్‌బాల్ పోటీలు



ఎంపికైన బాలికల జట్టు

రామకృష్ణాపూర్: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో బుధవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-19 జిల్లాస్థాయి హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలు నిర్వహించారు. బాలబాలికలకు వేర్వేరుగా నిర్వహించిన ఈ పోటీల్లో ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీల్లో సుమారు 150 మందికి పైగా క్రీడాకారులు పాల్గొనగా ప్రతిభ కనబరిచిన కొందరిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. త్వరలో మహబూబ్‌నగర్ జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రెటరీ బాబురావు, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కనపర్తి రమేష్, ఇంటర్మీడియట్ విద్యాధికారి శైలజ, జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం సంపత్, పీఈటీలు రాజలింగు, సారంగపాణి, గౌరమ్మ, సుదీప్ పాల్గొన్నారు.

అలరించిన రోల్‌ప్లే పోటీలు



నగదు పురస్కారం అందజేస్తున్న అధికారులు

మంచిర్యాలఅర్బన్: జిల్లా సైన్స్ కేంద్రంలో బుధవారం జనాభా విద్య విభాగంలో నిర్వహించిన జిల్లాస్థాయి రోల్‌ప్లే పోటీలు అలరించాయి. ఈ పోటీలకు వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. మంచిర్యాల తెలంగాణ మోడల్‌స్కూల్‌కు చెందిన విద్యార్థులు ప్రథమస్థానం సాధించడంతో రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు డీఈవో యాదయ్య తెలిపారు. కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారి చౌదరి, న్యాయనిర్ణేతలుగా సాగర్, శ్రీనివాస్, శ్రీనివాస్‌వర్మ వ్యవహరించారు.

నేడు జిల్లాస్థాయి కళోత్సవ్ పోటీలు

మంచిర్యాలఅర్బన్: జిల్లా సైన్స్ సెంటర్‌లో ఈ నెల 9న జిల్లా స్థాయి కళోత్సవ్ పోటీలు నిర్వహించనున్నట్లు డీఈవో యాదయ్య తెలిపారు. మండల స్థాయిలో ప్రతీ విభాగంలో ప్రథమస్థానంలో నిలిచిన బాలురు, బాలికలు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొనవచ్చని తెలిపారు. తమ గైడ్ టీచర్‌తో సహ ఉదయం 9.30గంటలకు హాజరు కావాలని తెలిపారు.

'బీజేపీ, బీఆర్‌ఎస్‌లను గద్దె దింపాలి'



మాట్లాడుతున్న ప్రేంసాగర్‌రావు

పాతమంచిర్యాల: బీజేపీ, బీఆర్‌ఎస్‌లను గద్దె దింపాలని కాంగ్రెస్ పార్టీ మంచిర్యాల అభ్యర్థి కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో సీపీఐ నాయకులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రజాస్వామ్యాన్ని భ్రష్టు పట్టిస్తున్నాయని విమర్శించారు. సీపీఐ, కాంగ్రెస్ పొత్తులు అసెంబ్లీ ఎన్నికలకే పరిమితం కాకుండా సింగరేణి ట్రేడ్ యూనియన్ ఎన్నికల్లో కూడా ఉంటాయని తెలిపారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేన శంకర్, జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, నాయకులు మేకల దాసు, బొల్లం పూర్ణిమా, ఖలిందర్ అలీఖాన్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

కాంగ్రెస్ కార్యకర్తపై బీఆర్ఎస్ నాయకుల దాడి

- టవర్ ఎక్కి నిరసన తెలిపిన బాధితుడు

కాసిపేట(బెల్లంపల్లి): మండలంలోని లంబాడి తండా(డీ) పంచాయతీకి చెందిన కాంగ్రెస్ కార్యకర్త తిరుపతిపై బుధవారం బీఆర్ఎస్ నాయకులు దాడికి పాల్పడటంతో అవమానంగా భావించిన బాధితుడు టవర్ ఎక్కిన సంఘటన కలకలం రేపింది. లంబాడితండా(డీ) పంచాయతీకి చెందిన తిరుపతి గ్రామంలోని కిరాణ దుకాణంలో ఉండగా బెల్లంపల్లి పట్టణంలో నిర్వహించిన సీఎం సభకు వెళ్లి తిరిగి వస్తున్న అధికార పార్టీ నాయకులు కాంగ్రెస్ పార్టీపై అనుచిత వ్యాఖ్యలు చేయడంతో నిలదీశాడు. దీంతో ఇరువురి మధ్య వాగ్వాదం చోటు చేసుకోవడంతో బీఆర్ఎస్ నాయకులు అతనిపై దాడికి పాల్పడ్డారు. విషయం తెలుసుకున్న బాధిత కుటుంబ సభ్యులు అక్కడికి రావడంతో వారిపైన కూడా దాడికి పాల్పడ్డారు. తమపై దాడిని అవమానంగా భావించిన తిరుపతి రాత్రి సెల్ టవర్ ఎక్కి నిరసన తెలిపాడు. తనపై దాడికి పాల్పడిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆందోళనకు దిగాడు. విషయం తెలుసుకున్న దేవాపూర్ ఎస్సై ఆంజనేయులు అక్కడికి చేరుకుని ఘటనకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామని నచ్చజెప్పి టవర్ దించారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

మొన్న బీజేపీ.. నిన్న బీఆర్ఎస్



బీఆర్ఎస్‌లో చేరిన సర్పంచ్ రాజయ్య

దండేపల్లి: దండేపల్లి మండలం అల్లీపూర్ సర్పంచ్ కొత్తపల్లి రాజయ్య ఈ నెల 5న బీఆర్ఎస్ పార్టీ నుంచి బీజేపీలో చేరారు. బుధవారం మాజీ ఎమ్మెల్యే అరవిందరెడ్డి, సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరాడు. రోజుకో పార్టీ మారుతున్న ప్రజా ప్రతినిధులు, నాయకుల తీరును చూసి జనాలు నవ్వుకుంటున్నారు.

మావోయిస్టు ఇలాఖాలో వీరులు వీరే



సుడిగాల విశ్వనాథసూరి



గడ్డం వెంకటస్వామి



కోదాటి రాజమల్లు



సోత్కు సంజీవరావు



బోడ జనార్దన్



గడ్డం వినోద్



నల్లాల ఓదెలు



బాల్క సుమన్



- చెన్నూర్ నియోజకవర్గం.. కార్మిక, కర్షకుల సమ్మేళనం
- అసెంబ్లీ ఎన్నికల్లో మందమర్రి కీలకం

చెన్నూర్: మావోయిస్టు ప్రభావిత నియోజకవర్గంగా పేరున్న చెన్నూర్‌లో ఇప్పటి వరకు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 8 మంది ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహించారు. చెన్నూర్ నుంచి గెలుపొందిన ఎమ్మెల్యేలకు ఉద్యమ చరిత్ర ఉంది. పట్టణానికి చెందిన సుడిగాల విశ్వనాథ సూరి సోషలిస్టు పార్టీ నుంచి పోటీ చేయగా కార్మిక నాయకునిగా పేరున్న కోదాటి రాజమల్లు, గడ్డం వెంకటస్వామి కార్మికుల సంక్షేమ కోసం పాటు పడ్డారు. మందమర్రికి చెందిన సోత్కు సంజీవరావు, బోడ జనార్దన్, నల్లాల ఓదెలు కార్మిక కుటుంబాల నుంచి వచ్చారు. గడ్డం వినోద్ వెంకటస్వామి వారసునిగా ఎన్నికల బరిలో దిగి విజయం సాధించారు. విద్యార్థి ఉద్యమ నాయకునిగా పేరున్న బాల్క సుమన్ 2014లో పెద్దపల్లి ఎంపీగా 2018లో చెన్నూర్ ఎమ్మెల్యేగా గెలుపొందారు.

పోరాటాల పురిటిగడ్డ

ఎమ్మెల్యే	పదవీ కాలం	పార్టీ
సుడిగాల విశ్వనాథసూరి	1952–57	సోషలిస్టు పార్టీ
గడ్డం వెంకటస్వామి	1957–62	కాంగ్రెస్
కోదాటి రాజమల్లు	1962–77	కాంగ్రెస్
సి.నారాయణ	1978–83	కాంగ్రెస్
సోత్కు సంజీవరావు	1983–85	సంజయ్ విచార్‌మంచ్
బోడ జనార్దన్	1985–2004	టీడీపీ
గడ్డం వినోద్	2004–09	కాంగ్రెస్
నల్లాల ఓదెలు	2009–10	టీఆర్ఎస్
నల్లాల ఓదెలు	2010–14	టీఆర్ఎస్
నల్లాల ఓదెలు	2014–18	టీఆర్ఎస్

చెన్నూర్ నియోజకవర్గానికి పోరాటాల పురిటిగడ్డగా, కార్మిక, కర్షక క్షేత్రంగా పేరుంది. ఈ నియోజకవర్గానికి 1952 నుంచి 2018 వరకు 15 సార్లు ఎన్నికలు జరిగాయి. చెన్నూర్ ఉమ్మడి నియోజకవర్గంలో 1952, 1957లలో ఎన్నికలు జరిగాయి. చెన్నూర్, లక్సెట్టిపేట, సిర్పూర్ ఉమ్మడి నియోజకవర్గాలకు జరిగిన ఎన్నికల్లో 1952లో విశ్వనాథ సూరి, 1957లో గడ్డం వెంకటస్వామి గెలుపొందారు.

సోషలిస్టు పార్టీ ఇలాఖాలో హస్తం హవా...

చెన్నూర్ అసెంబ్లీ స్థానానికి 1952లో జరిగిన ఎన్నికల్లో చెన్నూర్ పట్టణానికి చెందిన సూడిగాలి విశ్వనాథ సూరి ప్రజా సోషలిస్టు పార్టీ నుంచి పోటీచేసి గెలుపొందాడు. 1957లో చెన్నూర్, లక్సెట్టిపేట ఉమ్మడి నియోజకవర్గాలకు జరిగిన ఎన్నికల్లో చెన్నూర్ నుంచి గడ్డం వెంకటస్వామి పోటీ చేసి విజయం సాధించాడు. ఆ తర్వాత 1962లో చెన్నూర్ ప్రత్యేక నియోజకవర్గంగా ఏర్పడింది. 1962లో జరిగిన ఎన్నికల్లో కోదాటి రాజమల్లు సోషలిస్టు పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు. అనంతరం 1967, 1972లలో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన కోదాటి రాజమల్లు ఘన విజయం సాధించారు. 1978లో కాంగ్రెస్(ఐ) అభ్యర్థిగా సి.నారాయణ, 1983లో మందమర్రి పట్టణానికి చెందిన సోత్కు సంజీవరావు, సంజయ్ విచార్‌మంచ్ నుంచి పోటీ చేసి గెలిచారు. 1985, 1989, 1994, 1999లో జరిగిన ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పోటీచేసిన బోడ జనార్దన్ గెలుపొందారు. 2004లో జరిగిన ఎన్నికల్లో కేంద్ర మాజీ మంత్రి గడ్డం వెంకటస్వామి పెద్ద కుమారుడు గడ్డం వినోద్ కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసి విజయం సాధించాడు. ఆతర్వాత 2009లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వినోద్‌పై టీఆర్ఎస్ అభ్యర్థి నల్లాల ఓదెలు విజయం సాధించారు. 2010 ఉప ఎన్నికలతో పాటు 2014లో జరిగినసార్వత్రిక ఎన్నికల్లో నల్లాల ఓదెలు గెలుపొందారు.

పునర్విభజనలో తగ్గిన మండలాలు

2004లో నియోజకవర్గాల పునర్విభజన జరిగింది. అంతకుముందు చెన్నూర్ నియోజకవర్గంలో చెన్నూర్, మందమర్రి, జైపూర్ కోటపల్లి, వేమనపల్లి, నెన్నెల మండలాలు ఉండేవి. కొత్తగా ఏర్పడిన బెల్లంపల్లి నియోజకవర్గంలో నెన్నెల, వేమనపల్లి మండలాలు కలిశాయి. ప్రస్తుతం చెన్నూర్, మందమర్రి, జైపూర్, కోటపల్లి మండలాలు ఉండగా కొత్తగా ఏర్పడిన భీమారం 5 మండలాలతో కొనసాగుతోంది.

ఎన్నికల్లో మందమర్రే కీలకం

చెన్నూర్ నియోజకవర్గంలో చెన్నూర్, మందమర్రి, కోటపల్లి, భీమారం, జైపూర్ మండలాలు ఉన్నాయి. మందమర్రిలో కార్మిక ఓటర్లే అధికసంఖ్యలో ఉన్నారు. ఎన్నికల్లో కార్మికుల ఓట్లే కీలకం అవుతున్నాయి. నాలుగు మండలాల్లో 80 వేల ఓటర్లు ఉండగా ఒక్క మందమర్రిలోనే 75 వేల పైచిలుకు ఓటర్లు ఉన్నారు. అభ్యర్థుల గెలుపోటములను నిర్ణయించేది వారే కావడంతో అభ్యర్థులు మందమర్రిలోనే ఎక్కువగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారు.

నియోజకవర్గ ఓటర్లు ఇలా..

మండలం	పురుషులు	స్త్రీలు	ట్రాన్స్‌జెండర్స్	మొత్తం
మందమర్రి	37,669	37,755	4	75,428
జైపూర్	14,258	13,994	1	28,253
భీమారం	6,172	6,286	0	12,458
చెన్నూర్	21,304	21,534	0	42,838
కోటపల్లి	12,566	12,572	2	25,140
మొత్తం	91,969	92,141	7	1,84,117

ఆత్మరక్షణకు కరాటే

- బాలికలకు ఆత్మరక్షణ విద్య
- మూడు నెలలపాటు శిక్షణ

మంచిర్యాలఅర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో బాలికలకు ఆత్మరక్షణ విద్యలో శిక్షణకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. బాలికలకు రాణీ లక్ష్మీబాయి ఆత్మరక్షణ ప్రశిక్షణ్ నిర్భర్ పేరుతో అమలు చేయాలని విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు ఎంపిక చేసిన పాఠశాలల్లో కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. పాఠశాలల్లో బాలికలకు కరాటేలో మూడు నెలలపాటు శిక్షణ ఇవ్వాలని నిర్ణయించింది. తరగతులు పూర్తయిన తర్వాత సాయంత్రం గంటపాటు ఆత్మరక్షణ పాఠాలు బోధించి ప్రమాదం నుంచి ఎలా బయటపడాలో మెళకువలు నేర్పిస్తారు. ఆకతాయిల ఆగడాల నుంచి బాలికలు తమను తాము రక్షించుకోవడం, శారీరక ధృడత్వం సాధించడం, మానసికోల్లాసం కలిగించేందుకు ఆత్మరక్షణ విద్య ఎంతో దోహదం చేయనుంది.

మూడు నెలలు..

పాఠశాల స్థాయిలోనే బాలికలకు ఆత్మరక్షణ నైపుణ్యాలు నేర్పించడం ద్వారా మానసిక ధైర్యం పెంపొందుతుంది. ఆత్మరక్షణ విద్యను జిల్లాలోని మొత్తం 82 పాఠశాలల్లో మూడు నెలలపాటు అమలు చేయనున్నారు. ఇందులో ప్రాథమిక పాఠశాలలు–5, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు–77 ఉన్నాయి. ఈ పాఠశాలలో చదువుకునే బాలికలకు కరాటేలో శిక్షణ ఇస్తారు. ఒక్కో పాఠశాలల్లో శిక్షకుడిని ఎంపిక చేయాల్సి ఉంది. వీరికి నెల రోజులకు రూ.5వేలు వేతనం ఇవ్వనున్నారు. వారంలో మూడు రోజులపాటు పాఠశాల సమయం ఉదయం 9.30గంటల నుంచి సాయంత్రం 4.45 గంటల్లోపు ఎప్పుడైనా విద్యార్థులకు చదువులకు అంతరాయం కలుగకుండా నేర్పిస్తారు.

శిక్షణలో జాప్యం..

ఆత్మరక్షణ విద్య శిక్షణలో ఆలస్యం జరుగుతుంది. ముందుగా అక్టోబర్ 1నుంచి డిసెంబర్ 31 వరకు నిర్వహించాల్సి ఉన్నా సాంకేతిక కారణాల వల్ల జాప్యం జరిగింది. దసరా సెలవులకు రెండు రోజులకు ముందుగా ఉత్తర్వులు అందాయి. కరాటే శిక్షణ ఇవ్వడానికి ఎంపిక చేసిన శిక్షకులకు రూ.5వేలు పారితోషికం ప్రభుత్వం అందజేయనుంది. ఈ లెక్కన మూడు నెలలపాటు రూ.15వేలు గౌరవ భృతి అందజేయనున్నారు. వారంలోపు శిక్షణ ప్రారంభం కానుందని ఇంచార్జీ సెక్టోరల్ అధికారి సత్యనారాయణ మూర్తి తెలిపారు. ప్రస్తుతం శిక్షకుల నుంచి దరఖాస్తుల స్వీకరణ జరుగుతుందని, పూర్తి కాగానే శిక్షన ప్రారంభించనున్నారని తెలిపారు. శిక్షణ ప్రారంభ తేదీ నుంచి మూడు నెలలపాటు తరగతులు జరుగుతాయని పేర్కొన్నారు.

కిరాణ దుకాణంలో చోరీ

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని కిరాణంలో మంగళవారం రాత్రి దొంగతనం జరిగింది. పట్టణ ఎస్సై రాజేశ్వర్‌గౌడ్ తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.. నిర్మల్ పట్టణంలోని ప్రియదర్శినినగర్ నుంచి బస్టాండ్ వెళ్లే మార్గంలోని కిరాణ షట్టర్‌ను పగలగొట్టి లోపలకు చొరబడిన దొంగలు నగదు అపహరించారు. సీసీటీవీ ఫుటేజీ నమోదు చేసే రెండు డీవీఆర్‌లను ఎత్తుకెళ్లారు. బాధితుడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్సై తెలిపాడు.

ఒకరి ఆత్మహత్య

బోథ్: మండలంలోని నిగిని గ్రామానికి చెందిన కాల్లే జైవంత్‌రావ్(40) బుధవారం ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై రాము తెలిపారు. జైవంత్‌రావ్ కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. మంగళవారం మద్యం మత్తులో ఇంట్లోని పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు మండల కేంద్రంలోని సీహెచ్‌సీకి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు పేర్కొన్నారు.

'నో డ్యూస్' తప్పనిసరి

- ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు ఎలాంటి బకాయిలు ఉండొద్దు
- మున్సిపల్, జీపీల్లో ఇంటి, నల్లా, ఇతర పన్నులు చెల్లించాలి

మంచిర్యాలటౌన్: ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేయాలనుకునే వారి పేరిట ఉన్న ఆస్తులు, వ్యాపారాలకు సంబంధించిన పన్ను బకాయిలు పూర్తిగా చెల్లించి నో డ్యూస్ సర్టిఫికెట్ తీసుకోవడం తప్పనిసరి. జిల్లాలోని ఏడు మున్సిపాలిటీల్లో ఆస్తులు కలిగి ఉన్న ప్రధాన పార్టీల నాయకులు వారి పేరిట ఉన్న ఆస్తుల ట్యాక్స్‌లను ఇప్పటికే చెల్లించారు. ఇతర పార్టీల నుంచి టికెట్ ఆశిస్తున్న వారితో పాటు, స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేయాలనుకునే వారు సైతం పన్నులు చెల్లిస్తున్నారు. ఎక్కువగా మున్సిపాలిటీ పరిధిలోనే పలువురు అభ్యర్థులు నివాసం ఉండడంతో బకాయిలను పూర్తిగా చెల్లించి నో డ్యూస్ సర్టిఫికెట్ తీసుకున్నారు. ఇప్పటికే కొందరు నామినేషన్లను వేయగా మరికొందరు ఈ నెల 10లోగా వేసేందుకు సిద్ధమవుతున్నారు.

రూ.7.40 లక్షల ఆదాయం

నోడ్యూస్ చెల్లింపుల్లో భాగంగా మంచిర్యాల మున్సిపాలిటీలో 21 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో ఆస్తిపన్ను రూ.4.08,127, నల్లా పన్ను రూ.94,280 వరకు మొత్తం మున్సిపాలిటీకి రూ.5,02,407 ఆదాయం వచ్చింది. ఇందులో ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు ఎల్‌ఐసీ కాలనీలోని తన ఇంటిపన్ను రూ.15,078, నీటిపన్ను రూ.3,600 చెల్లించారు. తన తండ్రి నడిపెల్లి లక్ష్మణ్‌రావు పేరిట పాతమంచిర్యాలలోని ఇంటిపన్ను



మంచిర్యాల మున్సిపల్ కార్యాలయం

రూ.8,743, నీటిపన్ను రూ.18 వేలు చెల్లించారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు హైటెక్‌సిటీలోని తన ఇంటిపన్ను రూ.1,11,844, వాటర్ చార్జీలు రూ.3,600 చెల్లించారు. బీజేపీ అభ్యర్థి రఘునాథ్‌రావు వెరబెల్లి హైటెక్ సిటీ కాలనీలోని తన ఇంటిపన్ను రూ.6,380, వాటర్ చార్జీలు రూ.9 వేలు చెల్లించారు. నస్పూరు మున్సిపాలిటీలో ఐదుగురు నో డ్యూస్ సర్టిఫికెట్లు తీసుకున్నారు. మంచిర్యాల నుంచి బీఎస్పీ అభ్యర్థి తోట శ్రీనివాస్ ఇంటిపన్ను రూ.531, చెన్నూర్ నుంచి బరిలో నిలిచేందుకు ఆసక్తి చూపిస్తున్న వడ్లకొండ రాజం రూ.302 ఆస్తిపన్ను చెల్లించారు. చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్ చెన్నూరు మున్సిపాలిటీ పరిధిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి సంబంధించిన ఆస్తి పన్ను రూ.1,97,820, క్యాతన్‌పల్లి మున్సిపాలిటీలోని తన ఇంటిపన్ను రూ.20 వేలు చెల్లించి నోడ్యూస్ సర్టిఫికెట్ తీసుకున్నారు. మందమర్రి మున్సిపాలిటీ నుంచి మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు తన రెండిళ్లకు రూ.1,022, నూకల రమేశ్ రెండిళ్లకు రూ.1,907 ఇంటిపన్ను చెల్లించారు. లక్సెట్టిపేట్ మున్సిపాలిటీ పరిధిలో హనుమాండ్ల శంకర్‌కు ఇల్లు లేకపోవడంతో నో డ్యూస్ తీసుకుని నామినేషన్ వేశారు. బెల్లంపల్లి మున్సిపాలిటీ నుంచి ఐదుగురు రూ.5 వేలు చెల్లించి నో డ్యూస్ సర్టిఫికెట్ తీసుకున్నారు.

మద్యం పట్టివేత



స్వాధీనం చేసుకున్న మద్యం

రెబ్బెన(ఆసిఫాబాద్): మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం ఎక్సైజ్ సిబ్బంది నిర్వహించిన దాడుల్లో బెల్లం పానకం ధ్వంసం చేయడంతో పాటు 15 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ. 16,500 ఉంటుందన్నారు. గంగాపూర్ శివారులో నిల్వ ఉంచిన 900 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశారు. కైరిగాంలోని దుకాణంలో తనిఖీ నిర్వహించగా 15 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకుని ఒకరిపై కేసు నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో సీఐ సయ్యద్ మోసిన్ అలీ, ఎస్సై విజయలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యమకారులను విస్మరించిన కేసీఆర్

- ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్



మాట్లాడుతున్న జనక్‌ప్రసాద్

మందమర్రిరూరల్(చెన్నూర్): తెలంగాణ మలి దశ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారులను ముఖ్యమంత్రి కేసీఆర్ విస్మరించారని ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ అన్నారు. బుధవారం యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో చెన్నూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి, మాజీ ఎంపీ వివేక్, మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలుతో కలిసి మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలోనే 49 శాతం వాటా కేంద్ర ప్రభుత్వానికి అప్పగించారని కేసీఆర్ అబద్ధపు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పాలనలోనే సింగరేణి దోపిడీకి గురవుతోందన్నారు. ప్రైవేటైజేషన్ కోసం అప్పటి ఎంపీలు కవిత, సుమన్ సంతకాలు చేశారని మండిపడ్డారు. సింగరేణిలోని పలు గనులను ప్రైవేటీకరణ చేసిన ఘనత బీఆర్ఎస్‌దేనన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ మలి దశ ఉద్యమంలో పాల్గొన్న వీరంరాజు, కనకం వెంకటేశ్, చిట్టపల్లి శ్రీనివాస్, సురేందర్, సురేంద్రబాబు, ఆనందబాబు, తదితరులు కాంగ్రెస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు సమ్మయ్య, భూమయ్య, లక్ష్మణ్, సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.

వివాహితను వేధించిన ముగ్గురిపై కేసు

ఇంద్రవెల్లి: వివాహితను వేధించిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై దుబ్బాక సునీల్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం... మహారాష్ట్రకు చెందిన ఓ వివాహిత (30) తమ బంధువులుంటున్న అందర్‌బంద్ గ్రామానికి వెళ్లడానికి ఆదిలాబాద్ బస్టాండ్‌కు వచ్చింది. అక్కడి నుంచి ఇంద్రవెల్లి మండలంలోని దుర్వగూడ గ్రామానికి చెందిన పుసం హరిక్రిష్ణ, దుర్వ కాంతులతో పాటు మల్లాపూర్ గ్రామానికి చెందిన పుసం సుభాష్‌లు వివాహితను బలవంతంగా ఆటోలో ఎక్కించి ఇంద్రవెల్లి మండలానికి తీసుకొస్తూ అసభ్యకరంగా ప్రవర్తించి లొంగదీసుకునేందుకు యత్నించాడు. వారి మాటవినకపోవడంతో ఆటో నుంచి తోసేశారు. దీంతో వివాహిత కుడికాలుకు గాయమైంది. బుధవారం బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మితిమీరితే అంతే..

- ప్రచారంలో శబ్ద పరిమితులపై నిబంధనలు
- ఉల్లంఘిస్తే నియమావళి ప్రకారం చర్యలు



నిర్మల్‌ఖిల్లా: ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. ఎన్నికల మైకులు డీజే సౌండ్ బాక్స్‌లతో కూడిన ప్రచార వాహనాలు గల్లీగల్లీలో, గ్రామీణ ప్రాంతాల్లో సందడి చేస్తున్నాయి. ఎక్కడ చూసినా ప్రచార సాధనాల మోత చెవుల్లో మారుమోగుతోంది. జానపద టచ్‌తో కూడిన ప్రత్యేక గీతాలు హోరెత్తిస్తున్నాయి. అభ్యర్థుల గుణగణాలతో పాటు, పార్టీలకు సంబంధించిన పాటలు నిరంతరం హోరెత్తిస్తున్నాయి. అయితే ఈ ప్రచార సాధనాల మోత సాధారణ ప్రజానీకానికి, విద్యాసంస్థలు, ప్రార్థన మందిరాల వద్ద ఇబ్బందులు కలిగించే అవకాశాలున్నాయి. అదేవిధంగా వైద్యశాలలు, న్యాయస్థానాల సమీపంలో, వ్యాపార సముదాయాలు, పారిశ్రామిక ప్రాంతాల వద్ద విపరీతమైన ధ్వనులతో పాటలను పెట్టడంతో తీవ్ర ఇబ్బందులు తలెత్తనున్నాయి. ఈ నేపథ్యంలో ఎన్నికల కమిషన్ శబ్ద తీవ్రతపై కొన్ని నిబంధనలను నిర్ణయించింది. ఈసారి మితిమిరిన శబ్దంతో మైకులతో ఊదరగొడితే చర్యలు తీసుకునేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. అభ్యర్థులు, వారి తరఫున ప్రచారం చేసేవారు ఈ అంశాలపై జాగ్రత్త వహించాలి. ఏ ప్రాంతంలో ఎంత శబ్దంతో కూడిన ధ్వనులను వినియోగించాలో, ఎన్ని డెసిబుల్స్ మించకుండా ఉండాలో నిబంధనలను రూపొందించారు. దీని ప్రకారం డీజే ప్రచార సాధనాల ధ్వనిశబ్దం మితిమీరితే జరిమానాలతో పాటు జైలుశిక్ష పడే అవకాశం కూడా ఉందని అధికారులు అంటున్నారు.

ప్రాంతం	గరిష్టశబ్దం (డెసిబెల్స్‌లలో)
1. నివాస సముదాయాలు	–45 నుంచి 55
2. హాస్పిటల్స్ విద్యాసంస్థలు న్యాయస్థానాలు	–40 నుంచి 50
3. వ్యాపార సముదాయాలు	–55 నుంచి 65
4. పారిశ్రామిక ప్రాంతాలు	–70 నుంచి 75

అనుమతి ఉంటేనే మైకుల మోత...

అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేస్తున్న అభ్యర్థులు నిబంధనల మేరకే ప్రచారం నిర్వహించాలని ఎన్నికల నిబంధనలు వెల్లడిస్తున్నాయి. దీని ప్రకారం నాయకులు కార్యకర్తలు ఉదయం 6గంటల తర్వాత ప్రచారాన్ని ప్రారంభించి రాత్రి పది గంటలలోగా ముగించాలి. 10గంటలు దాటిన తర్వాత బహిరంగ సభలు, ఊరేగింపులు వంటివి నిర్వహిస్తే చర్యలు తీసుకుంటారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు చీరలు, చొక్కాలు ఇతర దుస్తులు క్రీడా పరికరాలు వాటి వస్తువులను పంపిణీ చేసి ఓటర్లను ప్రభావితం చేసేటట్లుగా ప్రయత్నించకూడదు. టోపీలు, కండువాలను మాత్రం వాడొచ్చు. వాటిని ఖర్చులు ఎన్నికల వ్యయంలో పొందుపరచాలి. అభ్యర్థులు ఎన్ని వాహనాలు ఉపయోగించుకుంటారో, దానికి ముందస్తు అనుమతిని రిటర్నింగ్ అధికారి నుంచి పొంది ఉండాలని నిబంధనలు తెలుపుతున్నాయి. ప్రచార వాహనాలు, మైక్ సెట్‌లు ముందస్తు అనుమతి మేరకే వినియోగించాలి. సమావేశం, ఊరేగింపు వంటి వాటి కార్యక్రమాల సమాచారం పోలీసులకు ముందస్తుగా అందించాలి. ఊరేగింపులు, సభలు, సమావేశాలు కొనసాగుతున్నప్పుడు వివిధ రకాల రాజకీయ పార్టీలు ఒకేమార్గంలో వెళ్తున్నప్పుడు ఒకే సమయంలో ఊరేగింపులు తీస్తున్నప్పుడు పోలీసులకు సహకరిస్తూ కార్యక్రమాలను పూర్తి చేసుకోవాలి. విపరీతమైన శబ్దాలు, టపాసులు, భారీ పేలుళ్ల వంటి పదార్థాలను వినియోగించకూడదు. వ్యక్తిగత విమర్శలు చేసుకోకుండా ఎన్నికల నియమావళి ప్రకారం నడుచుకోవాలి.

భక్తజనసంద్రంగా కాకో ఆలయం



చీరె, సారె తీసుకువస్తున్న సీపీ రెమారాజేశ్వరి



కాకో ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

దండేపల్లి: ఆదివాసీల ఆరాధ్య దైవం మండలంలోని గుడిరేవు గోదావరి ఒడ్డున ఉన్న పద్మల్‌పురి కాకో ఆలయం బుధవారం జనసంద్రంగా మారింది. దండారీ ఉత్సవాల్లో భాగంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ఆదివాసీ గిరిజనులు కుటుంబ సమేతంగా తరలివచ్చి కాకో అమ్మవారిని దర్శించుకున్నారు. పప్పుతో తయారు చేసిన గారెలను నైవేద్యంగా సమర్పించారు. గుస్సాడీల వేషధారణలు, నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కాకో అమ్మవారికి రామగుండం సీపీ రెమా రాజేశ్వరి, మండలంలోని మేదరిపేట లక్ష్మీనారాయణస్వామి ఆలయ వ్యవస్థాపకురాలు లింగాల శ్రీమతి ఆలయం తరఫున చీరసారెను అందించారు. మాజీ ఎమ్మెల్యే అరవిందరెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

కనీస వసతుల కల్పనకు కృషి

ఆలయం వద్ద భక్తులకు కనీస సౌకర్యాల కల్పనకు సంబంధిత అధికారులతో మాట్లాడి, తనవంతు కృషి చేస్తామని రామగుండం సీపీ రెమా రాజేశ్వరి తెలిపారు. ఆలయంలో నిర్వహించిన గుస్సాడీ దర్బార్‌లో ఆమె పాల్గొన్నారు. ఆలయ కమిటీ సీపీకి గిరిజన వాయిద్యాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజనుల ఆత్మీయత మరువలేనిదని అన్నారు. గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలు తనకెంతగానో నచ్చాయన్నారు. గుస్సాడీల నృత్యాలు తిలకించారు. నగదు పురస్కారాన్ని అందించడంతోపాటు గిరిజన పెద్దలు, మహిళలకు బట్టలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మంచిర్యాల ఏసీపీ తిరుపతిరెడ్డి, లక్సెట్టిపేట సీఐ కృష్ణ, దండేపల్లి ఎస్సై ప్రసాద్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



పెళ్లి సంబంధం కుదరగానే వారి వారి స్థోమత మేరకు
పెళ్లి ఎంత గ్రాండ్‌గా చేయాలనే
ఆలోచన చేస్తుంటారు పెద్దవాళ్లు.
పెళ్లిలో కాబోయే అత్తగారి డిమాండ్ మేరకు
వధువు అమ్మానాన్నలు నడుచుకుంటూ ఉంటారు.
ఇందులో భాగంగా ఇటీవల
మరో కొత్త డిమాండ్ కూడా వచ్చి చేరింది.
కాబోయే పెళ్లికూతురు వివాహ వేడుకలో
దేదీప్యమానంగా వెలిగిపోవాలి.
అందరూ 'అందమైన కోడలిని సెలెక్ట్ చేసుకున్నారు
అనే కితాబులు అందుకోవాలి. అందుకు, ఏ చికిత్స
చేయించుకున్నా సరే!' అంటున్నారు. మరి,
కాబోయే వధువులు వేడుకకు సిద్ధం కావడానికి
ఎలాంటి కేర్ తీసుకుంటున్నారు. ఈ క్రమంలో
అందం పట్ల తీసుకుంటున్న చికిత్సలు..
వికటిస్తున్న పరిమాణాలు ఏమిటి?
భేష్ అనదగిన విధానాలేమిటి?
అనే విషయాలపై తప్పనిసరిగా దృష్టి పెట్టాలి.

ఆపరేషన్ బ్యూటీ

పెళ్లి సంబంధాల్లో 'కొత్త' డిమాండ్

"ఓ మల్టీనేషనల్ కంపెనీలో పనిచేస్తున్న సుష్మ పెళ్లి వచ్చే డిసెంబర్‌లో జరగనుంది. పెళ్లి ఫిక్స్ అయ్యాక అత్తగారు నవ్వుతూ – 'అమ్మాయీ, నీ వంటి రంగు బ్రైట్ చేయించుకో. ఫెయిర్ నెస్ కోసం ఇంజెక్షన్లు మార్కెట్‌లో దొరుకుతాయని విన్నాను. వాటిని ట్రై చేయి. ఏ ట్రీట్‌మెంట్ అయినా తీసుకో. కానీ, పెళ్లి టైమ్‌కి అందంగా తయారవ్వాలి' అని ఆర్డర్ వేసింది. ఆమె తన కోడలు పందిట్లో చందమామలా కనిపించాలని, కోడలు మొహం చూసి బంధుమిత్రులంతా నిశ్చేష్టులవ్వాలని కోరుకుంటుంది. 'అత్తగారి డిమాండ్ ఇప్పుడు నాకు ఆందోళన కలిగిస్తోంది' అంటోంది సుష్మ. ఇందుకోసం బ్యూటీ ట్రీట్‌మెంట్స్‌తో పాటు చర్మ ఛాయలో కూడా తేడా వచ్చేలా మార్పులు చేసుకోవడానికి తెగ కష్టపడుతోంది. 'పెళ్లి అంటేనే ఎంతో ఉత్సాహం. ఫొటోల్లో, వీడియోల్లో బాగా కనిపించాలని, అందరిలో ప్రత్యేకంగా వెలిగిపోవాలని నాకూ ఉంటుంది. ఇందుకు బ్యూటీ పార్లర్స్‌కి వెళ్లడం, మేకప్ చేయించుకోవడం సాధారణంగా జరుగుతుంటుంది. కానీ, ఇప్పుడు ప్రత్యేకంగా ట్రీట్‌మెంట్స్ కూడా చేయించుకోవాల్సి వస్తోంది. పెళ్లి ఖర్చులే కాకుండా ఈ కొత్త తరహా ఖరీదైన ఖర్చు తలనొప్పిగా మారింది అంటున్నారు అమ్మనాన్నలు' అని బాధపడుతోంది సుష్మ.

★ ★ ★

కాబోయే అత్తగారు కోరడంతో రూప (పేరు మార్చడమైంది) తన కంటి కింది భాగం లోతుగా ఉండటం వల్ల 'అండర్ ఐ ఫిల్లర్' ఇంజక్షన్ చేయించుకుంది. దీంతో కంటి కింది భాగంలో రక్తం గడ్డకట్టి, వాపు వచ్చి, బయటకు రాలేని పరిస్థితి. త్వరలో పెళ్లి. ఆ క్లాట్ అంత తొందరగా తగ్గదు. దిక్కుతోచని పరిస్థితి.

★ ★ ★

శిల్ప అందం కోసం బొటాక్స్ ట్రీట్‌మెంట్ చేయించుకుంది. డోస్ ఎక్కువ మోతాదులో ఇవ్వడం వల్ల ముఖంలో ఎక్స్‌ప్రెషన్స్ ఇవ్వడానికి వీలు లేకుండా మారిపోయింది.

★ ★ ★

అందం పెంచుకునే విషయంలో ఒకరో ఇద్దరు కాదు అమ్మాయిలు ఎప్పుడూ తమ ప్రయత్నాలు చేస్తూనే ఉంటారు. ఇక పెళ్లి అంటే చెప్ప నక్కర్లేదు. ప్రీ వెడ్డింగ్ షూట్ నుంచి ప్రతి సంబరాన్నీ పదిలపరుచుకోవడానికి ఎన్నో పాట్లు పడతారు. దీంట్లో భాగంగా బ్యూటీ కాన్షియస్ అమ్మాయిల్లోనూ, అబ్బాయిల్లోనూ పెరిగింది. ఈ విషయంలో ఎలాంటి చికిత్స, జాగ్రత్తలు తీసుకోవాలో తెలుసుకోవడం మంచిది అంటున్నారు డెర్మటాలజిస్ట్ డాక్టర్ స్వప్న ప్రియ. వాటిలో...

ఇంట్లో ప్రయోగాలు..

చాలా మంది అందానికి ఇంటి చిట్కాలు పాటిస్తుంటారు. సహజంగా లభించే వాటితో బ్యూటీప్యాక్‌లు వేసుకుంటూ ఉంటారు. వాటి ద్వారా ఎంత సమయంలో ఎంత ప్రయోజనం ఉంటుందో కూడా చూడాలి. ఎందుకంటే, కొంతమందికి స్కార్స్, పింపుల్స్, యాక్నె, డల్ స్కిన్, కలర్ ఛేంజ్, చుండ్రు... ఇలా చాలా సమస్యలు ఎదుర్కొంటూ ఉంటారు. వాటికి చికిత్సనే సరైన మార్గం. ఆహారానికి సంబంధించినవి తప్పనిసరిగా పెళ్లికి రెండు నుంచి మూడు నెలల ముందు మార్పులు చేసుకోవాలి. సహజంగా చర్మంలో మార్పులు రావాలంటే పోషకాహారం మంచి ఎంపిక. అప్పుడే మంచి ఫలితం ఉంటుంది.

బ్యూటీ స్పాలో చికిత్స మంచిదేనా?

స్కిన్ టైటనింగ్, రింకిల్స్, స్కిన్ హైడ్రేషన్.. వంటి ట్రీట్‌మెంట్స్ బ్యూటీ స్పాలలో చేయించుకుంటారు. దీనికి కూడా ముందు సరైన కౌన్సెలింగ్ అవసరం. ఒక్కో వ్యక్తి చర్మ తత్త్వం ఒక్కో విధంగా ఉంటుంది. ఈ విధానంలో చర్మం రికవరీ అవడానికి కూడా సమయం పడుతుంది.

ఇంజక్షన్లు సరైనవేనా...

కృత్రిమంగా కొలాజన్, స్కిన్ బూస్టర్స్.. అని తీసుకుంటున్నారు. ఎవరో చెప్పారని కొంతమంది నర్సులను ఇంటికి పిలిపించుకొని ఇంజక్షన్లు చేయించుకుంటారు. మంచి లుక్ కోసం ట్రై చేయచ్చు. కానీ, వాటి డోసుల్లో తేడాలొస్తే మొత్తం తిరగబడుతుంది.

సహజమైన మెరుపే మేలు



డాక్టర్ స్వప్నప్రియ
సీనియర్ డర్మటాలజిస్ట్

పెళ్లి 10-15 రోజులు ఉందనగా ఏ బ్యూటీ ట్రీట్‌మెంట్ చేయించుకోకూడదనే విషయం ముందు గ్రహించాలి. కనీసం ఆరు లేదా మూడు నెలల ముందు బ్యూటీ చికిత్సలు చేయించుకోవచ్చు. దీని ద్వారా సైడ్ ఎఫెక్ట్స్ ఉంటే నివారించుకునే అవకాశం ఉంటుంది. కృత్రిమ అందాన్ని ఎవరూ ఇష్టపడరు. ఎప్పుడైనా సహజమైన మెరుపును ఇచ్చే బ్యూటీ ట్రీట్‌మెంట్ మాత్రమే మంచిదని గమనించాలి. అయినా తప్పదు అనుకునేవారు స్కిన్ బూస్టర్స్, ఇతర ట్రీట్‌మెంట్ వైపుగా వెళ్లచ్చు. ఇందుకు నిపుణుల పర్యవేక్షణ అవసరం.

ఆన్‌లైన్‌లో చూసి ...

సోషల్ మీడియా ప్రభావం వల్ల ఆన్‌లైన్‌లో బ్యూటీ ఉత్పత్తులు తెప్పించుకొని, అప్లై చేసుకోవడం చూస్తుంటాం. వాటి వల్ల ఇబ్బందుల పాలైన వారు చాలా మంది ఉంటారు. ఎందుకంటే, అవి వారికి ఎంత వరకు నప్పుతాయో తెలియదు.

కెమికల్ పీలింగ్

కెమికల్ పీల్‌లో బయటి నుంచి చర్మంలోకి ఎలాంటి రసాయనాలు చొప్పించరు. మృతకణాలను తొలగిస్తారు, చర్మం పై పొర నుండి టానింగ్, పిగ్మెంటేషన్ తగ్గి కొత్త పొర కనిపిస్తుంది. అయితే, దీని ద్వారా చర్మంపై కొత్త సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. నిపుణుల సలహా అవసరం. ఇంకొన్ని పీఆర్‌పీ చికిత్సలు చర్మ నిగారింపును తీసుకువస్తాయి. అయితే, వధువులు కాబోయే అమ్మాయిలు పెళ్లికి 3 నుండి 6 నెలల ముందు ఈ కాస్మెటిక్ విధానాలను ప్రారంభించాలి. ఎందుకంటే వారి సిట్టింగ్‌లలో కనీసం 3 వారాల గ్యాప్ ఉండాలి.

లైటర్ టోన్‌లకు డిమాండ్

పెళ్లి చేసుకోబోయే అమ్మాయిలు తమ ప్రీ–బ్రైడల్ విధానంలో రంగు ఫెయిర్‌గా మారడం పట్ల ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. నిజానికి, సూర్యకిరణాల నుండి మన చర్మాన్ని మనం రక్షించుకోనప్పుడు, చర్మంలో పాచెస్ ఏర్పడతాయి. కొన్నిసార్లు సూర్యకాంతి కుడి వైపున, మరి కొన్నిసార్లు ఎడమ వైపున ఎక్కువగా పడుతుంది. సూర్యుని అతినీలలోహిత కిరణాలు చర్మ కణాలను దెబ్బతీస్తాయి. పిగ్మెంటేషన్‌ను ప్రేరేపిస్తాయి. దీంతో అంతటా 'చర్మపు రంగు' ఒకే విధంగా ఉండదు. అంటే ముఖం మీద చాలా చోట్ల టాన్ ఉంటుంది. ఈవెన్ టోన్‌ని కలిగి ఉండాలంటే ఇంటి నుంచి బయటకు వెళ్లే ముందు ముఖంపై సన్‌స్క్రీన్‌ని అప్లై చేయడం చాలా ముఖ్యం.

కాస్మెటిక్ ఫిల్లర్స్...

నిఖిత పెదవులు చాలా సన్నగా ఉంటాయి. రంగు చాలా తక్కువ. ఒకరోజు ఆమె కాబోయే అత్తగారు ఫోన్ చేసి 'నీ ముఖంలో పెదవులు కనిపించడం లేదు. ఏదైనా చికిత్స తీసుకో' అంది. దీంతో నిఖిత నర్సులను కాస్మెటిక్ ఫేషియల్ ఫిల్లర్లను ఆశ్రయించింది. దీనిని లిప్ ఫిల్లర్ అని కూడా అంటారు. దీర్ఘకాలిక ఫలితాల కోసం, ప్రతి 6 నుండి 8 నెలలకు ఇంజెక్షన్లు చేయాలి. కాస్మెటిక్ ఫేషియల్ ఫిల్లర్లే కాకుండా, హైలురానిక్ యాసిడ్ ఫిల్లర్ ఇంజక్షన్లు కూడా ఈ రోజుల్లో బాగా ప్రాచుర్యం పొందాయి. ఈ డెర్మా ఫిల్లర్‌లతో పెదవులు హైడ్రేటెడ్‌గా ఉంటాయి. పగుళ్లు రావు, పూర్తి పరిమాణంలో కనిపిస్తాయి. అలాగే, కొందరు అమ్మాయిలు అత్తింటి వారు బరువు తగ్గమన్నారు కదా అని లైపోసక్షన్ వంటి చికిత్సలు చేయించుకుంటారు. దీని వల్ల చర్మంపై చారలు ఏర్పడతాయి. అవి అంత త్వరగా పోవు. ముక్కు, పెదాలు, బ్రెస్ట్ సరిచేసుకోవడానికి కాస్మాటిక్ సర్జరీలు కూడా చేయించుకుంటారు. ఏ చికిత్స అయినా కనీసం ఆరు నెలల ముందు చేయించుకుంటే వచ్చే సైడ్‌ఎఫెక్ట్‌నూ నివారించవచ్చు.



టిప్

డ్రై ఫ్రూట్స్ గిఫ్ట్ ఇస్తున్నారా?

దీపావళికి డ్రైఫ్రూట్స్‌ను గిఫ్ట్‌గా ఇస్తుంటారు చాలామంది. అయితే డ్రైఫ్రూట్స్‌ను కొనేటప్పుడు కచ్చితంగా ఇవి గమనించుకోవాలి. ● నట్స్ రంగు ఎలా ఉందో చూడాలి. సహజంగా ఉండాల్సిన దానికంటే మరింత ముదురు రంగులో ఉంటే అవి పాడైనట్లు. రుచిగా కూడా ఉండవు కాబట్టి కొనకపోవడమే మంచిది. ● వీలైతే ఒకటి రెండు నట్స్‌ను నీటిలో వేసి, పదినిమిషాల తరువాత కొరికి చూడాలి. నానిన తరువాత కూడా గట్టిగా ఉంటే అవి చాలా పాతవి. ఇవి ఆరోగ్యానికి అంత మంచిది కాదు కాబట్టి తీసుకోకూడదు. చాలా షాపులు తినడానికి శాంపిల్స్ ఇవ్వవు. ఇలాంటప్పుడు ఆ డ్రైఫ్రూట్స్‌ను తక్కువ పరిమాణంలో కొనుక్కుని పరిశీలించాలి ● నట్స్‌ని వాసన చూడాలి. ఘాటైన వాసన వస్తే అవి చాలా పాతవి. వీటికి కొద్దిగా తేమ తగిలితే వెంటనే బూజు పట్టి త్వరగా పాడవుతాయి. ఇవి తినడం ఆరోగ్యానికి మంచిది కాదు ● నట్స్ ప్యాకెట్ మీద ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ ముద్ర, నిబంధనలకు అనుగుణంగా ఉందో లేదో చూడాలి. ఎప్పుడు ప్యాకింగ్ అయ్యింది? ఎప్పటిలోగా తినాలో సూచించే డేట్స్‌ను సరిగా చూసుకోవాలి. ఈ డేట్స్ ముద్రించని ప్యాకెట్స్‌ను కొనకూడదు ● ప్యాకెట్ మీద ముద్రించిన సమాచారాన్ని జాగ్రత్తగా చదవాలి. ప్రిజర్వేటివ్‌లు కలిపిన నట్స్‌ను కొనకపోవడమే మంచిది.

ఖుషీతో దిల్ ఖుష్



చిన్నతనంలో తాము పడ్డ కష్టాలు తమ పిల్లలు పడకూడదని వారికి నొప్పి తెలియకుండా ఎంతో కష్టపడి పెంచుతారు తల్లిదండ్రులు. అయితే లక్నోకు చెందిన ఖుషీ అందుకు భిన్నం. తన తండ్రిలా మరెవరూ కష్టపడకూడదని తానే ఓ సామాజిక కార్యకర్తగా మారి సాటి యువతకు ఆదర్శంగా నిలుస్తోంది ఖుషీ పాండే.

లక్నోకు చెందిన 23 ఏళ్ల ఖుషీ పాండే బాల్యం ఉన్నావ్ అనే ఊళ్లో గడిచింది. తన తండ్రి నుంచి చిన్ననాటి విషయాలను క్షుణ్ణంగా తెలుసుకుంది. ఖుషీ తండ్రికి బాగా చదువుకోవాలని ఉండేది. కానీ పెన్సిల్ కొనే స్థోమత కూడా లేదప్పుడు. ఈ విషయం తెలుసుకుని, నాన్నలా మరెవరూ చదువుకోసం ఇబ్బంది పడకూడదు అనుకుంది. నిరుపేదలకు సాయం చేయాలని చిన్నప్పుడే గట్టిగా నిర్ణయించుకుంది.

ఖుషీ పెద్దయ్యేసరికి నాన్న వాళ్ల లక్నోకి మకాం మార్చారు. అక్కడ ఓ షాపులో పనిచేస్తూ తరువాత కాంట్రాక్టర్‌గా మారారు. ప్రభుత్వానికి సంబంధించిన ప్రాజెక్టులు కూడా రావడంతో ఖుషీ కుటుంబ ఆర్థిక పరిస్థితులు మెరుగుపడ్డాయి. దీంతో ఖుషీ 'లా' పూర్తయ్యాక, సోషల్ వర్క్‌లో పీజీ చేసింది. చదువు పూర్తయ్యాక వెంటనే నిరుపేదలకు చదువు చెప్పడం ప్రారంభించింది. మురికివాడల్లోని పిల్లలను ఒక చెట్టుకింద కూర్చోబెట్టి సాయంత్రం రెండుమూడు గంటలు చదువు చెప్పేది. రోజుకి యాభై మంది వరకు ఖుషీ క్లాసులకు హాజరయ్యేవారు. తన దగ్గరకు వచ్చే పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించడంతోపాటు, వారి తల్లిదండ్రులకు చదువు ప్రాముఖ్యతను వివరిస్తోంది.

తాతయ్య మరణంతో...

అది 2020 ... ఒకరోజు రాత్రి ఖుషీ వాళ్ల తాతయ్య షాపు నుంచి తిరిగి వస్తున్నారు. చీకట్లో సరిగా కనిపించక ఎదురుగా వచ్చే కారు తాతయ్య సైకిల్‌ని ఢీ కొట్టడంతో ఖుషీ తాతగారు అక్కడికక్కడే చనిపోయారు. తాతయ్యను ఎంతో ఇష్టపడే ఖుషీ ఈ చేదు సంఘటనను తట్టుకోలేకపోయింది. సైకిల్‌కు లైట్ ఉంటే ఈ ప్రమాదం జరిగేది కాదు అనుకుని ప్రతి సైకిల్‌కు లైటు ఉండాలని భావించింది. రోజూ కూలి పనిచేసుకునేవారు తమ సైకిళ్లకు లైట్లు పెట్టుకోవడానికి తగ్గ స్థోమత ఉండేది కాదు. దాంతో వాళ్లకు ఒక్కొక్కరికి 350 రూపాయల ఖరీదు చేసే లైట్లను ఉచితంగా పంచింది. ఇలా ఇప్పటిదాకా 1500 మంది వాహనాలకు బ్యాటరీతో నడిచే లైట్లను అమర్చింది. లైట్లు అమర్చడానికి 'ఇన్‌స్టాల్ లైట్స్ ఆన్ బైస్కిల్' అని రాసిన ఉన్న ప్లకార్డు పట్టుకుని వీధుల్లో తిరుగుతూ ఎంతోమందికి అవగాహన కల్పించింది. అప్పట్లో ఖుషీ చేసిన ఈ పనిని ఓ ఐఏఎస్ అధికారి వీడియో తీసి సోషల్ మీడియాలో షేర్ చేయడంతో తెగ వైరల్ అయ్యింది. ఈ విషయం తెలిసిన ఎనభైమంది యువకులు ఖుషీతో కలిసి సైకిళ్లు, ట్రక్కులకు, ఇతర వాహనాలకు లైట్లు అమర్చడంలో ఖుషీకి సాయంగా నిలిచారు.





పాఠాలతో పైసలు సంపాదించి...

ఖుషీ చేస్తోన్న సామాజిక కార్యక్రమాలకు నిధులు చాలా కావాలి. ఇందుకు తన తండ్రి, బంధువులు సమకూర్చిన మొత్తం ఏమాత్రం సరిపోలేదు. దాంతో యూట్యూబ్‌లో 'లా' తరగతులు చెప్పడంతోపాటు, ఇతర పార్ట్ టైమ్ ఉద్యోగాలు చేస్తూ నెలకు అరవై నుంచి డెబ్బై వేల వరకు సంపాదించి సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ, నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపుతోంది.

మహిళలకు అండగా...

బాలికలకు శానిటరీ ప్యాడ్ ల గురించి అవగాహన కల్పించడం, విద్యుత్ సదుపాయం లేని వారికి సోలర్ ల్యాంప్స్ అందించడం, 'జీవిక సాథీ' ప్రాజెక్టు పేరుతో దివ్యాంగ మహిళలు, వితంతువులు, ఒంటరి మహిళలకు కుట్టు మిషన్, జ్యూవెలరీ తయారీలో శిక్షణ ఇప్పించి వారి కాళ్ల మీద వాళ్లు నిలబడేలా చేయడం వంటి సేవా కార్యక్రమాలతో ఎంతోమందికి ఆదర్శంగా నిలుస్తోంది.

దుర్గ ఇండియా



ప్రతి స్త్రీ దుర్గ వలే...

ప్రతి స్త్రీలో ఒక దుర్గ ఉంటుంది. కాని ఆ దుర్గను అదిమి పెట్టేలా కుటుంబం, సమాజం ఆమెను తీర్చి దిద్దుతాయి. దాంతో తన మీద ఏ అన్యాయం జరిగినా చెప్పలేని స్థితికి చేరుతుంది. 'నువ్వు దుర్గవి. పోరాడు' అని చెప్తారు బెంగళూరులోని 'దుర్గ ఇండియా' టీమ్ సభ్యులు. ప్రియా వరదరాజన్ అనే యాక్టివిస్ట్ ఏర్పాటు చేసిన ఈ గ్రూప్ స్త్రీలను కుటుంబ హింస నుంచి... లైంగిక వేధింపుల నుంచి కాపాడటానికి పని చేస్తోంది. వారి పోరాటానికి శక్తినిస్తోంది.

'ప్రతి ఒక్కరూ మార్పు కోసం ఎదురు చూస్తారు. మనమే మార్పు కోసం ప్రయత్నిద్దామని ఎందుకు అనుకోరు... ఎదురు చూస్తూ కూచుంటే మార్పు వస్తుందా?' అంటారు ప్రియా వరదరాజన్.


బెంగళూరులో 'దుర్గ ఇండియా' అనే సంస్థ స్థాపించి స్త్రీల సమస్యలపై పని చేస్తున్న ప్రియ ఇటీవల బెంగళూరు మాల్‌లో ఒక వ్యక్తి స్త్రీలను అసభ్యంగా తాకడం గురించి ప్రస్తావిస్తూ 'పబ్లిక్ ప్లేసుల్లో– బహిరంగ ప్రదేశాల్లో గాని ఆన్‌లైన్‌లోగాని స్త్రీల గౌరవ మర్యాదలకు భంగం కలిగిస్తే అలాంటి వారిపై చర్య తీసుకునేందుకు ఆ బాధిత మహిళకు అండగా నిలవడం మేము చేసే పని. చట్టాలు ఎన్ని ఉన్నా, పోలీసులు, మహిళా పోలీసులు ఎందరు ఉన్నా మహిళలకు సాటి మహిళ అండగా ఉంటే కలిగే ధైర్యం వేరు. తోటి మహిళలతో వారు చెప్పుకునేవి వేరు. అలాంటి వారికి యోగ్యులైన కౌన్సెలర్లతో కౌన్సెలింగ్ చేయించి దిలాసా ఇప్పిస్తాము. అంతే కాదు బాధితులను వెంటబెట్టుకొని– ఆ స్టేషన్‌కుపో ఈ స్టేషన్‌కు పో అనే బాధ లేకుండా బెంగళూరులో వన్ స్టాప్ సెంటర్స్‌లో ఫిర్యాదు చేయిస్తాము. తోడుగా మేమొస్తే బాధితులు ఫిర్యాదు చేయడానికి జంకరు. ఎటొచ్చీ వారికి తోడు నిలిచే స్త్రీల బృందాలు అన్నిచోట్లా ఉండాలి' అంటుంది ప్రియ.

ఐ యామ్ ఎవ్రి ఉమన్

పదేళ్ల క్రితం ప్రియా వరదరాజన్ 'ఐ యామ్ ఎవ్రి ఉమన్' పేరుతో ఒక బ్లాగ్ రాయడం మార్పు కోసం ఆమె వేసిన మొదటి అడుగు. ఆ బ్లాగ్‌కు క్రమంగా చాలామంది మహిళా ఫాలోయర్లు వచ్చారు. వారు తమ అనుభవాలను ప్రియతో పంచుకోసాగారు. 'అందరిదీ ఒకే కథ. అందరూ మరొక స్త్రీ లాంటి వారే అని నాకు అర్థమైంది. స్త్రీల కోసం పని చేయాల్సిన అవసరం తెలియజేసింది. స్త్రీల కోసం పని చేయడం అంటే వారి పట్ల భావజాలాన్ని మార్చడమే' అంటుంది ప్రియ.

మగాడు ఎందుకు అలా చేస్తాడు?

'గతంలో సమాజంలో స్త్రీలకు ఏదైనా సమస్య వచ్చి ఆమె బయటకు చెప్పినప్పుడు– ఆమెలో ఏ దోషం ఉందో అన్నట్టుగా నిందను ఆమె మీదే వేసేవారు ఉండేవారు. వారి భావజాలాన్ని మార్చడమే చేయవలసింది. స్త్రీకి ఏదైనా అన్యాయం జరిగినప్పుడు ఆ మగాడు ఆమెతో అలా ఎందుకు చేశాడు అని ఆలోచించేలా చేస్తే సగం మార్పు వచ్చినట్టే. ఇంట్లో, వీధిలో, ఆఫీసులో స్త్రీలు ఆత్మాభిమానంతో ఉండాలంటే మగాళ్లు మారాలి. అందుకు ఒక రోజు సరిపోదు. ఒకరు పని చేస్తే సరిపోదు. ప్రతి ఒక్కరం ఏదో ఒక మేరకు పని చేయాల్సిందే' అంటుంది ప్రియ.



అందరినీ 'దుర్గ'లుగా మారుస్తూ

అన్యాయం జరిగితే వెరవకుండా ప్రతిఘటించమని ప్రియ ఆధ్వర్యంలో 'దుర్గల' బృందం చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తోంది. స్కూళ్లలో, కాలేజీలలో, బస్తీలలో తిరుగుతూ స్త్రీలకు తమ హక్కులను, చట్టపరమైన రక్షణను, సహాయం చేసే బృందాలను తెలుపుతుంది. 'నేను ఒంటరిదాన్ని కాను అని స్త్రీ అనుకుంటే చాలు... ఆమె పోరాడగలదు' అంటుంది ప్రియ.

ఇంత ప్రయత్నం చేసే ప్రియ లాంటి వారి సంఖ్య ఎంత పెరిగితే దుర్గలకు అంత శక్తి పెరుగుతుంది.

ఫస్ట్ టైమ్

మంత్రముగ్ధులను చేసే దాస్తాంగోయి



● ఫౌజియా

'దాస్తాంగో ప్రదర్శన ఇస్తున్నది ఓ అమ్మాయా!!' అని బోలెడు ఆశ్చర్యపడుతూనే ప్రేక్షకుల మధ్య కూర్చున్నాడు ఒక ప్రేక్షకుడు. ఇలా కూర్చొని అలా వెళ్లిపోదాం... అనుకున్నాడు. అయితే ప్రదర్శన పూర్తయ్యే వరకు కదలకుండా కూర్చున్నాడు.

ఆ హాల్‌లో నవ్వుల్లో నవ్వు అయ్యాడు. ఏడుపులో ఏడుపు అయ్యాడు. సకల భావోద్వేగాల సమ్మేళనంతో 'దాస్తాంగోయి' ఫౌజియాను ఆశీర్వదించాడు. ఉర్దూలో మౌఖిక కథాసాహిత్య కళారూపం... దాస్తాంగో.

పురుషులకు మాత్రమే పరిమితమైన ఈ కళారూపంలో అపారమైన పేరు తెచ్చుకొని 'ఫస్ట్ ఫిమేల్ దస్తాంగోయి'గా గుర్తింపు పొందింది ఫౌజియా...

ఢిల్లీకి చెందిన ఫౌజియాకు స్కూల్ రోజుల నుంచి సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలు అంటే ఇష్టం. స్కూల్లో ప్రదర్శించే నాటకాల్లో పాల్గొనేది. ఫౌజియా తండ్రి మోటర్‌బైక్ మెకానిక్. ఆర్థిక పరిస్థితి రీత్యా ఫౌజియా ఎప్పుడో చదువు మానేయాలి. ట్యూషన్‌లు చెప్పగా వచ్చిన డబ్బుతో పై చదువులు చదివింది. మాస్ కమ్యూనికేషన్‌లో డిగ్రీ చేసింది.

దయాల్ సింగ్ కాలేజీలో చదువుకునే రోజుల్లో ఒకరోజు తొలిసారిగా 'దాస్తాంగో' ప్రదర్శన చూసింది ఫౌజియా. ఇక అప్పటి నుంచి 'దాస్తాంగో' పై ఆసక్తి, అభిమానం పెరిగాయి. తాను కూడా 'దాస్తాంగోయి'గా పేరు తెచ్చుకోవాలనుకుంది. 'ఇది పురుషులకు మాత్రమే పరిమితమైన కళారూపం. మహిళలు చేయలేరు. ఒకవేళ చేసినా ప్రేక్షకులు ఆదరించరు' అన్నట్లుగా చాలామంది మాట్లాడారు.

ఆ మాటలు విని ఫౌజియా కొంచెం కూడా నిరాశపడలేదు. తనపై తనకు గట్టి నమ్మకం ఉంది.

'జీవితాంతం దాస్తాంగో చెంతనే ఉండాలనుకున్నాను. ఎంతో చరిత్ర ఉన్న ఈ కళ గురించి ఈ తరంలో కొద్ది మందికి మాత్రమే తెలుసు. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఈ తరానికి కూడా తెలిసేలా దాస్తాంగోకు ప్రాచుర్యం తీసుకురావాలనుకున్నాను' అంటుంది ఫౌజియా.

డానీష్ హుస్సేన్, మహ్మద్ ఫారూఖీ లాంటి గొప్ప కళాకారుల నుంచి 'దాస్తాంగో'ను నేర్చుకుంది ఫౌజియా. ఫౌజియా కథాసంవిధానంలో కృత్రిమమైన భాషా గాంభీర్యం వినిపించదు. పాత ఢిల్లీ యాస మాత్రమే వినిపిస్తుంది.

'మన దేశంలో ఎన్నో భాషలకు సంబంధించి ఎన్నో మాండలికాలు ఉన్నాయి. ప్రతి మాండలికానికి తనదైన సొగసు ఉంటుంది. ఈతరంలో చాలామంది తమ యాసను దాచి పెట్టే ప్రయత్నం చేస్తుంటారు. ఇది సరి కాదు. మన ఊరు, తల్లిదండ్రులు, సంస్కృతి గురించి గొప్పగా చెప్పుకున్నట్లే మన మాండలికం గురించి కూడా గొప్పగా చెప్పుకోవాలి' అంటుంది ఫౌజియా.

ఫౌజియాకు పుస్తకాలు చదవడం అంటే ఇష్టం. ముఖ్యంగా ఉర్దూ సాహిత్యం. చిన్నప్పుడు అమ్మ, అమ్మమ్మ, నానమ్మల నుంచి ఎన్నో కథలు విన్నది. అద్భుతమైన రీతిలో కథలు చెప్పేవారు. కథను ఎక్కడ మొదలు పెట్టాలి, ఎక్కడ విరామం ఇవ్వాలి, మళ్లీ ఎక్కడ మొదలు పెట్టాలి... అనే దాంట్లో వారు సిద్ధహస్తులు. ఆ మెళకువలు ఊరకే పోలేదు...'దాస్తాంగో'లో ఫౌజియాకు బాగా ఉపకరించాయి.

అమ్మమ్మ, నానమ్మల నుంచి ఎన్నో కథలు విన్నది. అద్భుతమైన రీతిలో కథలు చెప్పేవారు. కథను ఎక్కడ మొదలు పెట్టాలి, ఎక్కడ విరామం ఇవ్వాలి, మళ్లీ ఎక్కడ మొదలు పెట్టాలి... అనే దాంట్లో వారు సిద్ధహస్తులు. ఆ మెళకువలు ఊరకే పోలేదు... 'దాస్తాంగో'లో ఫౌజియాకు బాగా ఉపకరించాయి.



జానపద కథలు మాత్రమే కాకుండా సామాజిక సందేశం ఉన్న ఆధునిక కథలను కూడా చెబుతూ ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది ఫౌజియా. దేశవిభజన సమయంలో మహిళలు ఎదుర్కొన్న సమస్యలు, హింస గురించి కథగా చెబుతున్నప్పుడు ప్రేక్షకులు కదిలిపోయారు. కోవిడ్ కల్లోల సమయంలో ఫౌజియాకు 'దాస్తాంగో' ప్రదర్శనలు ఇవ్వడానికి కుదరలేదు. దీంతో ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారానే ప్రదర్శన ఇచ్చింది.

మహాభారతం కథల నుంచి స్వాతంత్ర్యం కోసం మహాత్ముడి పోరాటం వరకు 'దాస్తాంగోయి'గా ప్రేక్షకులను మెప్పిస్తున్న ఫౌజియాకు ఉర్దూ భాషలోనే కాదు హిందీ, ఇతర భాషలలోనూ 'దాస్తాంగో' ప్రదర్శనలు ఇవ్వాలనేది కల. ఆమె కల నెరవేరాలని ఆశిద్దాం.